పోలింగ్‌కు సర్వం సిద్ధం

నిఘా నీడలో పోలింగ్ కేంద్రాలు

- మొదటి సారిగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్
- ప్రతి 2గంటలకు పోలింగ్ శాతం ప్రకటన
- అందుబాటులో అదనంగా 140 ఈవీఎంలు
- సాంకేతిక సమస్య తలెత్తితే వెంటనే మార్పు
- 5వేల మందికి పైగా దివ్యాంగులు, వృద్ధులు
- ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు



కుత్బుల్లాపూర్: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇప్పటికే పలు దఫాలుగా వివిధ విభాగాల అధికారులతో తరుచూ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఎక్కడా ఎలాంటి చిన్న సమస్యలు కూడా తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు.

590 పోలింగ్ కేంద్రాలు..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 590 బూత్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో బూత్‌లో ఒక ప్రాసిడింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ ప్రాసిడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, ఒక బూత్ లెవల్ అధికారి ఉంటారు. అదే విధంగా నలుగురు పోలీసులు, నలుగురు పారిశుద్ధ్య సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉంటారు.

సీసీ కెమెరాల నిఘాలో..

మొత్తం 590 పోలింగ్ బూత్‌లు ఉండగా అందులో 90 సమస్యాత్మకంగా గుర్తించారు. ప్రతి కేంద్రం లోపల సీసీ కెమెరా, వెబ్ క్యాస్టింగ్ నిర్వహిస్తుండగా సమస్యాత్మక ప్రాంతాల్లో వెలుపల సైతం కెమెరాలను ఏర్పాటు చేశారు. అదే విధంగా 90 బూత్‌ల్లో 42 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. అక్కడ ప్రతి కదలికలను క్షుణ్ణంగా పర్యవేక్షిస్తారు.

ఒక్కో అధికారి 10 – 12 బూత్‌ల పర్యవేక్షణ

41 రూట్‌లు విభజించి 41 మంది సెక్టోరియల్ అధికారులను నియమించారు. ఒక్కో అధికారి 10 నుంచి 12 బూత్‌లను పర్యవేక్షిస్తారు. ఇక్కడ రిటర్నింగ్ అధికారి పులి సైదులుతో పాటు 8 మంది సహాయ అధికారులుగా ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్నారు. అదే విధంగా 6 మోడల్ కోడ్ టీమ్‌లు, 6 ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 4 స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్, 7 వీడియో సర్వేలెన్స్ బృందాలు ఉన్నాయి. ప్రతి రెండు గంటలకోసారి ఎన్నికల రిటర్నింగ్ అధికారి నమోదైన పోలింగ్ శాతాన్ని ప్రకటిస్తారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకోనున్న 467 మంది

దివ్యాంగులు, 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు నియోజకవర్గంలో సుమారు 5వేల మందికి పైగా ఉన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం వీరి కోసం మొదటి సారిగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను ప్రవేశపెట్టింది. నేరుగా వారి ఇళ్ల వద్దకే వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు కల్పించింది. దీంతో ఈసారి 467 మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ముందస్తుగా ఈ పోస్టల్ బ్యాలెట్‌పై విస్తృతంగా ప్రచారం చేసి ఉంటే ఈ సంఖ్య గణనీయంగా పెరిగేది.

అందుబాటులో వీల్‌చైర్లు, వైద్య సిబ్బంది

- ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద దివ్యాంగులు, వృద్ధులకు వీల్‌చైర్‌లను ఏర్పాటు చేశారు. ఆరోగ్య సిబ్బంది మెడికల్ చెకప్ క్యాంప్‌లను ఏర్పాటు చేశారు.
- నియోజకవర్గంలో 590 పోలింగ్ బూత్‌లలో 590 ఈవీఎంలను ఏర్పాటు చేశారు. ఈవీఎంల్లో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే సెక్టోరియల్ అధికారులు వెంటనే వాటి స్థానంలో వేరే ఈవీఎంలను ఏర్పాటు చేస్తారు. అందుకు గాను అదనంగా 140 వరకు ఈవీఎంలను అందుబాటులో సిద్ధంగా ఉంచారు.



పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది



గాజులరామారం గ్రామంలో పోలింగ్‌స్టేషన్ వద్ద పోలీసు భద్రత

సుభాష్‌నగర్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఒకరోజు ముందుగానే బుధవారం నియోజకవర్గ పరిధిలోని ఆయా పోలింగ్ స్టేషన్లకు సిబ్బంది చేరుకున్నారు. ముందస్తుగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి, ఇతర వ్యక్తులను లోనికి వెళ్లకుండా తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక నిఘా

- సమస్యాత్మక ప్రాంతాలలో పటిష్ట భద్రత
- చందానగర్ సీఐ పాలవెల్లి

హఫీజ్‌పేట్ : పోలింగ్ నేపథ్యంలో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రత్యేక నిఘాతో పాటు పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని చందానగర్ సీఐ పాలవెల్లి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 6 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామన్నారు. చందానగర్‌లోని శాంతి నగర్, వేముకుంట, లింగంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్, పాపిరెడ్డి కాలనీ, గోపినగర్, గోపన్‌పల్లి ప్రాంతాలు సమస్యాత్మకంగా ఉన్నాయని సీఐఎస్‌ఎఫ్ ప్రత్యేక పోలీసు బలగాలతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామన్నారు.

అమ్మానాన్నలతో తప్పకుండా ఓటు వేయిస్తా



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కుత్బుల్లాపూర్: అమ్మానాన్నలతో తప్పకుండా ఓటు వేయిస్తామని సుచిత్రలోని త్రివేణి పాఠశాల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. బుధవారం పాఠశాలలో ఓటు మన హక్కు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సమాజంలో అభివృద్ధికి పాల్పడే వారిని ఎన్నుకోవాలని పిల్లలు తల్లిదండ్రులకు గుర్తు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వాణి, సీఎస్‌వో సుబ్బారావు, సీఆర్‌వో వెంకటరావు, ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

దాతల సహకారంతో స్వాములకు నిత్యాన్నదానం



దాతలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దుండిగల్: అయ్యప్ప స్వామి దేవాలయంలో నిత్య అన్నదాన కార్యక్రమాలు జరుగుతున్నాయి. బౌరంపేటలోని ఆశ్రితవత్సల అయ్యప్పస్వామి దేవాలయంలో ప్రతిరోజు దాతల సహకారంతో అయ్యప్పస్వాములకు అన్నదానం నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రగతినగర్‌కు చెందిన రాజ్‌కుమార్ స్వామి, శ్రీనివాస్ గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్పలకు భిక్ష ఏర్పాటు చేశారు. మూడేళ్లుగా స్వామివారి మాల ధరించిన స్వాములకు 41 రోజుల పాటు నిత్యాన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

144 సెక్షన్ అమలు.. విధుల్లో 2500 మంది పోలీసులు

- నలుగురి కంటే ఎక్కువమంది గుమిగూడితే చర్యలు
- పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకే అనుమతి
- సెల్‌ఫోన్లను అనుమతించం: మాదాపూర్ డీసీపీ సందీప్

గచ్చిబౌలి: పోలింగ్ కేంద్రాలు, ఇతర ప్రాంతాలలో నలుగురి కంటే ఎక్కువ మంది గుమికూడితే చర్యలు తీసుకుంటామని మాదాపూర్ డీసీపీ గోనె సందీప్ స్పష్టం చేశారు. మద్యం అమ్మకాలు నిషేధమన్నారు. 28 సమస్యాత్మక ప్రాంతాలలో సీఏపీఎఫ్ సిబ్బందిని నియమించామని, అదనపు బలగాలు మూడు కంపెనీలతో పాటు 600 మంది పోలీసు సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. పోలింగ్ కేంద్రంలో ఎలాంటి ఘటన చోటు చేసుకున్నా ఒక్క నిమిషంలో అక్కడున్న పోలీసులు స్పందిస్తారని, 8 నిమిషాలకు రూట్ మొబైల్, 12 నిమిషాలలో క్యూఆర్టీ టీం, 18 నిమిషాలలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ చేరుకుంటుందన్నారు. పోలింగ్ బూత్‌లోకి పార్టీ గుర్తులు, స్లిప్స్, పెన్ను, ఇంక్, వాటర్ బాటిల్స్, సిగరెట్స్, లైటర్స్‌ను అనుమతించమన్నారు. ఎక్కడైనా ప్రలోభాలకు పాల్పడితే సీవీజిల్, డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.

కాప్ 28 యూఏఈ సదస్సుకు ఆహ్వానం

బోడుప్పల్: ఈనెల 30వ తేదీ నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు దుబాయ్‌లో జరగనున్న కాప్ 28 యుఏఈ సదస్సుకు ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ జాతీయ సలహాదారులు, లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి ఆహ్వానం అందినట్లు ఆయన వెల్లడించారు. బోడుప్పల్‌లోని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో 200 దేశాల నుంచి ప్రతినిధులు, వ్యాపార, ఆర్థిక నిపుణులు, పౌర సమాజ ప్రతినిధులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ ఆహ్వానం రావడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన వెల్లడించారు.

ఎక్సైజ్ దాడులు.. మద్యం పట్టివేత

మేడ్చల్: ఎన్నికల వేళ అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయాలకు పాల్పడుతున్న వారిపై మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి మద్యం స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపిన వివరాల ప్రకారం మూడుచింతలపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో దాడులు చేయగా ఇద్దరి నుంచి 13లీటర్ల బీర్లు, 11లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి 63.7 లీటర్ల బీర్లను స్వాధీనం చేసుకున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం జవహర్‌నగర్ సీఐ సీతారాం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని, పోలింగ్ కేంద్రాల వద్ద సెంట్రల్ టీమ్, స్థానిక పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రతతో ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు అనిల్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, లక్ష్మణ్, వేణుమాధవ్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి బూత్ ముందు అభ్యర్థుల వివరాలు

ఫిలింనగర్: పోలింగ్ శాతం పెంచేందుకు ఈసారి ఎన్నికల అధికారులు వినూత్న కార్యక్రమాలతో ముందుకు వచ్చారు. ఓటరు పోలింగ్ కేంద్రానికి తేలికగా చేరుకునేలా ఏర్పాటు చేశారు. గత నాలుగు వారాల నుంచి ఓటర్లను లక్ష్యంగా చేసుకొని వారికి సకల సౌకర్యాలు కల్పించే దిశలో దృష్టి పెట్టారు. పోలింగ్ స్టేషన్ ముందు అభ్యర్థుల ఫొటోలు, గుర్తులు వివరాలతో కూడిన పోస్టర్లను అంటించారు. అంతేకాకుండా ఇప్పటికే పోల్ చీటీలను పంపిణీ చేసి అక్కడికి తేలికగా చేరుకునే గూగుల్‌మ్యాప్‌ను కూడా ఏర్పాటు చేశారు.

నాలెడ్జి సిటీలో సీ1జీఐసీ సెంటర్

ప్రారంభించిన సంస్థ సీఈఓ జెఫ్రీ రస్సెల్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జిసిటీలో సీ1 (కన్వర్జ్‌వన్) గ్లోబల్ ఇన్నోవేషన్ అండ్ కేపబిలిటీస్ సెంటర్ (జీఐసీసీ) తన కార్యకలాపాలను భారతదేశంలో ప్రారంభించింది. ఈ సంస్థ కార్యాలయాన్ని బుధవారం జీఐసీసీ సంస్థ సీఈఓ జెఫ్రీ రస్సెల్ ప్రారంభించారు. సీ1 అధునాతన సాంకేతికత, పరిష్కారాల సంస్థ. దీన్ని ప్రారంభించిన అనంతరం విలేకరులలో ఆ సంస్థ సీఈఓ జెఫ్రీ రస్సెల్ మాట్లాడుతూ 10వేలకు పైగా గ్లోబల్ వినియోగదారులకు వినూత్న పరిష్కారాలను, అసమానమైన సేవలను అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో సీ1 ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ , కంట్రీ హెడ్ చంద్ర బొడ్డోజు, చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ కొలీన్ హేబర్‌మాన్, చీఫ్ గ్రోత్ ఆఫీసర్ అమృత్‌చౌదరి, అధికారులు పాల్గొన్నారు.



లక్షల్లో ఓటర్లు.. వేలల్లో స్లిప్పులు

అత్యధిక మందికి అందని ఓటర్ స్లిప్పులు

కుత్బుల్లాపూర్: ఓటరు స్లిప్పుల పంపిణీలో గందరగోళం నెలకొంది. మరి కొన్ని గంటల్లో ఓటింగ్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో స్లిప్పులను పంపిణీ చేయకపోవడం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 6,99,042 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 3,66,660 మహిళలు, 3,32,223 పురుషులు, 159 మంది ఇతరులు ఉన్నారు.

◆ ఎన్నికల అధికారులు ఇంటింటికి తిరిగి ఓటరు స్లిప్‌లను పంచే బాధ్యత బీఎల్‌ఓ (బూత్ లెవల్ అధికారి)లకు అప్పగించారు. కానీ నియోజకవర్గ పరిధిలోని కొన్ని కాలనీలు, బస్తీల్లో అసలు తమకు ఓటరు స్లిప్పులు ఇవ్వలేదని ఓటర్లు చెబుతున్నారు. లక్షల సంఖ్యలో ఓటర్లు ఉండగా వేలల్లోనే స్లిప్‌లను పంపిణీ చేశారని పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు సైతం విమర్శిస్తున్నారు.

అధికారుల కంటే ముందే పంచిన పార్టీలు..

బీఎల్‌ఓలు అన్ని ప్రాంతాల్లో ఓటరు స్లిప్‌లను పంపిణీ చేయలేదన్న అపవాదు ఒక వైపు ఉండగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మాత్రం దూకుడు ప్రదర్శించారు. మెజార్టీ స్థాయిలో ప్రధాన పార్టీల నేతలు తమ నాయకుడికే ఓటు వేయాలని పార్టీ ప్రచార కరపత్రాలతో పాటు ఓటరు స్లిప్‌లను పంచి అధికారుల కంటే ముందు నిలిచారు. ఇదిలా ఉండగా ఓటరు స్లిప్‌లను పంచే విషయంలో కొన్ని ఇబ్బందులు వచ్చాయని బీఎల్‌ఓలు పేర్కొంటున్నారు. ఎక్కువ సంఖ్యలో అద్దెకు ఉండే వాళ్లు తమ చిరునామాను మార్చి ఇతర ప్రాంతాలకు వెళ్లారని... కొందరు స్థానికంగా లేరని ఇలా పలు కారణాలను బీఎల్‌ఓలు చెప్పుకొచ్చారు.

హింస, అఘాయిత్యాలపై మహిళలు ఏకం కావాలి

అల్వాల్: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించడానికి అల్వాల్ లయోల కళాశాలలో వాయిస్ 4 గర్ల్స్, లయోల అకాడమి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి నిపుణులు, న్యాయవాదులు హాజరై సమాజాన్ని ఒకేచోట చేర్చడానికి చర్యలు తీసుకుంది. ఈ సందర్భంగా వాయిస్ 4 గర్ల్స్ డిప్యూటీ డైరెక్టర్ వనిత ప్రభ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న వివిధ రకాల హింసలపై ఉద్ఘాటించారు. బాలికలపై జరుగుతున్న హింసలు, అఘాయిత్యాలను అరికట్టడానికి మహిళలందరూ ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎంఏ.జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా వాహనాల పార్కింగ్



నందానగర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిలుపుతున్న వాహనాలు

రంగారెడ్డినగర్: వాహనాల పార్కింగ్‌లకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. గల్లీలు మొదలుకుని, బహిరంగ ప్రదేశాల్లో ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్న కార్లు, ట్రాలీల యజమానులు పాఠశాల, ఆస్పత్రి ఆవరణలను సైతం వదలడం లేదు.. రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్ కమిటీ హాలు ప్రాంగణంలో ఓ పక్క ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, దానిని ఆనుకుని బస్తీ దవాఖానాలు కొనసాగుతున్నాయి. అయితే స్థానికంగా ఉన్న కొందరు స్థానికులు కమిటీ హాలు ఆవరణలోని ఖాళీ స్థలంలో ప్రతినిత్యం తమ కార్లు, ఇతర వాహనాలను నిలుపుతున్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో బస్తీ దవాఖానాకు వచ్చే రోగులు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

టాయిలెట్లకు అడ్డుగా నిలుపుతూ..

కమిటీ హాలు ఆవరణలో పాఠశాల మూత్రశాలలు శిథిలావస్థకు చేరడంతో ప్రస్తుతం వాటిని మూసివేశారు.జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో టాయిలెట్‌ను ఏర్పాటు చేసి ప్రతినిత్యం ట్యాంక్‌తో నీటిని నింపుతూ విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నాయి. అయితే ఆవరణలో వాహనాలు నిలపడంతో టాయిలెట్ ట్యాంక్‌లో నీటిని నింపేందుకు వచ్చే వాహనానికి అడ్డంకిగా మారుతోంది. దీంతో ప్రస్తుతం టాయిలెట్లకు నీటి సదుపాయం నిలిచిపోయింది.



రిపేరుకు వచ్చిన వాహనాన్ని ఉంచిన దృశ్యం

◆ దీంతో విద్యార్థులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మూత్రశాలలకు వెళ్లలేక ఉగ్గబట్టుకుని ఉంటున్నారు. సమీపంలో ఉండే విద్యార్థులు ఉపాధ్యాయులను పర్మిషన్ అడిగి తమ ఇళ్లకు వెళ్లి వస్తున్నారు. అదూ విధంగా పాఠశాల ఆవరణలోనే రిపేరుకు వచ్చిన పాత వాహనాలను డంప్ చేస్తున్నారు. ఈ విషయమై అధికారులు కల్పించుకుని కమిటీ హాలు ప్రాంగణంలో వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని రోగులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పగలే వెన్నెల.! పట్టించుకోకపోతే ఎలా?





చాకలి ఐలమ్మ చౌరస్తాలో, జగద్గిరిగుట్ట లాస్ట్‌బస్టాప్ ఇందిరగాంధీ విగ్రహం వద్ద వెలుగుతున్న దీపాలు

రంగారెడ్డినగర్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా 24/7 వీధి దీపాలు వెలుగుతున్నాయి. కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలోని పలు ప్రధాన చౌరస్తాలతో పాటు రోడ్ల వెంబడి రాత్రి వేళల్లో వెలుగులు నింపేందుకు అధికారులు వీధి దీపాలతో పాటు హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల వెలిగే దీపాలను రోజు ఉదయం 6 గంటలకు ఆపివేస్తారు. అయితే జగద్గిరిగుట్ట ప్రధాన రోడ్డులోని చాకలి ఐలమ్మ చౌరస్తా, లాస్ట్‌బస్టాప్‌లోని ఇందిరగాంధీ విగ్రహం వద్ద ఉన్న హైమాస్ట్ లైట్లు 24 గంటల పాటు వెలుగుతూనే కనిపించడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. ఓ వైపు విద్యుత్‌ను ఆదా చేయాలని ప్రకటనలు చేసే అధికారులు ఇలా రేయింబవళ్లు వీధి దీపాలు వెలుగుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు నిర్దేశించిన సమయాల్లోనే వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: పోలింగ్ అధికారులు ఈవీఎం యంత్రాలను, పోలింగ్ మెటీరియల్ చెక్ లిస్ట్ ప్రకారం సరిచూసుకుని, తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ సూచించారు. బుధవారం మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి పోలింగ్ సిబ్బందికి, అధికారులకు సూచనలు చేశారు.

◆ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవీఎం యంత్రాలను సదరు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పజెప్పాలని, రిజర్వ్ ఈవీఎం యంత్రాలు, రిజర్వు పోలింగ్ సామాగ్రి సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉండాలని, సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల నిబంధనలను పాటించాలని అన్నారు.

◆ పోలింగ్ సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లో తమకు కేటాయించిన కేంద్రాల్లోనే బస చేయాలని, ఓటు గోప్యతకు అనుగుణంగా పోలింగ్ కేంద్రంలో సిబ్బంది ఏజెంట్లు కూర్చునే విధంగా సిట్టింగ్ ఏర్పాటు చేసుకొని అవసరమైన ఫారాలను సిద్ధం చేసుకొని ఉదయం 5.30 గంటలకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి క్లియర్ చేయాలని సూచించారు. పోలింగ్‌కు సంబంధించి ఓటింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలిస్తూ ఎటువంటి చిన్న ఘటన దృష్టికి వచ్చినా వెంటనే తెలపాలన్నారు.

వేయడం మన బాధ్యత

◆ నిర్భయంగా, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా ఓటు వేసేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ చెప్పారు. సాధారణ ఎన్నికల నియమావళి అమలులో భాగంగా జిల్లా ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేయాలన్నారు. ఓటు కలిగిన ప్రతి పౌరుడు స్వేచ్ఛగా ఓటు వేయాలని, దేశ పౌరులుగా ఎన్నికల్లో ఓటును వినియోగించుకోవడం మన బాధ్యత అని ఆయన అన్నారు.

అజహరుద్దీన్‌పై 'కోడ్ ఉల్లంఘన' కేసు

ఫిలింనగర్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి ప్రచార గడువు ముగిసిన తర్వాత సమావేశం ఏర్పాటు చేసిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ అజహరుద్దీన్‌తో పాటు మరో ఎనిమిది మందిపై ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఉల్లంఘన కేసు నమోదైంది. వివరాలివీ... జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి అజహరుద్దీన్ మంగళవారం రాత్రి 9 గంటలకు టోలిచౌకి సమీపంలోని బృందావన్ కాలనీ ప్లాట్ నెం .100 టెర్రస్‌పై కొంత మంది కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఇది నిబంధనలకు విరుద్ధమని ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ సభ్యుడు అభిషేక్ తివారి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి 9 గంటలకు ఇక్కడ సమావేశం జరుగుతున్నట్లుగా సమాచారం అందిందని దీనికి అజహరుద్దీన్ హాజరయ్యారని వెంటనే తాము ఫిలింనగర్ ఎస్ఐ గణేష్‌గౌడ్‌కు సమాచారం ఇచ్చామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీసులు అక్కడికి చేరుకోగా అజహరుద్దీన్‌తో పాటు మహ్మద్‌ఖలీల్, సయ్యద్ అఫ్రోజ్, మహ్మద్ సలావుద్దీన్ అహ్మద్, షౌకత్‌అలీ, ఖాన్, సయ్యద్‌రషీద్ హుస్సేని, రెహ్మాన్, ఖాసిం జునైది తదితరులు సమావేశం అయినట్లు గుర్తించారు. వీరిపై ఐపీసీ సెక్షన్ 188, 143, రెడ్‌విత్ 34, 126 ఆర్‌పీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలాదిత్యకు అక్కినేని పురస్కారం

చిక్కడపల్లి: బాలనటునిగా ప్రవేశించి తెలుగుచలన చిత్రరంగంలో తనదైన శైలిలో రాణిస్తున్న బాలాదిత్య నటన ప్రశంసనీయమని పలువురు ప్రముఖులు అన్నారు. కళానిలయం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో బాలాదిత్యకు నటసామ్రాట్ అక్కినేని ప్రతిభా పురస్కార ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శతచిత్ర సినీ నిర్మాత రామ సత్యనారాయణ బాలాదిత్యను సత్కరించారు. కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు, కాంగ్రెస్ నేత షేక్ పర్వేజ్, నిర్మాత మాగంటి ప్రసాద్, సామాజికవేత్త బద్రీనాథ్, కాకుమాను జ్యోతి , సురేందర్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో గంటల తరబడి ట్రాఫిక్ జామ్

ఉప్పల్: నిత్యం ట్రాఫిక్ చిక్కుల్లో ఉండే ఉప్పల్ ఓట్ల పండుగ రావడంతో గ్రామాల్లోకి వెళ్లేందుకు ప్రజలు పెద్ద ఎత్తున పల్లె బాట పట్టారు. దీంతో ఉప్పల్‌లో ఉదయం 10 గంటల నుంచి వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుని విలవిల్లాడారు. హబ్సిగూడ నుంచి ఉప్పల్ చౌరస్తా వరకు, నాగోల్ బ్రిడ్జి నుంచి ఉప్పల్ వరకు, అటువైపు నల్ల చెరువు వరకు పూర్తిగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. నగరవాసులు ఓటు వేయడానికి పల్లెటూరు బాట పట్టడంతో ఉప్పల్ వరంగల్ బస్టాప్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. అందుకు అనుగుణంగా ఆర్టీసీ అధికారులు అదనపు బస్సులను వేయడంతో వచ్చిన బస్సులు రోడ్డుమీదే రెండు, మూడు వరుసలుగా నిలబెట్టడంతోనే ట్రాఫిక్ జాం అవుతోందని వాహనదారులు అన్నారు. ఉప్పల్ చౌరస్తాలో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేస్తే ఇంత ఇబ్బంది కలిగేది కాదని అంటున్నారు.

'పంచశీల' నూతన కార్యవర్గం

అల్వాల్: పంచశీల ఎన్‌క్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షులు రాజేష్, ఉపాధ్యక్షులు భరత్‌రెడ్డి, కోశాధికారి నరేష్ మిట్టల్, ప్రధాన కార్యదర్శి ఎం.రవి, సంయుక్త కార్యదర్శి బశ్వరాజ్, సలహాదారులు విజయ్‌వర్ధన్‌రెడ్డి, సభ్యులుగా శ్రీనివాస్, చంద్రం, మాధవరెడ్డి, సందీప్‌రావు, శ్రీకాంత్‌రాజు, మధుసూధన్, కిరణ్‌కుమార్ తదితరులు ఎన్నికయ్యారు.

నాటక రంగాన్ని కాపాడుకుందాం

మామిడి హరికృష్ణ

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతగానో ఉందని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న సురభి నాటకోత్సవాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్త ప్రహ్లాద, మాయాబజార్ నాటకాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

ఘనంగా కార్తీకమాస వన భోజనాలు

జియాగూడ: ప్రతి యేటా ఆర్యవైశ్య సంఘం పురానాపూల్ కార్వాన్ ఆధ్వర్యంలో కార్తీకమాస వన భోజనాలను ఘనంగా నిర్వహిస్తామని ప్రాజెక్టు కన్వీనర్ మాడిశెట్టి సదానందం గుప్తా, ప్రాజెక్టు చైర్మన్ యాద శ్రీనివాస్ గుప్తా అన్నారు. బుధవారం పెంజర్ల అనంత పద్మనాభస్వామి ఆలయ ఆవరణలో ఆర్యవైశ్య సంఘం పురానాపూల్ కార్వాన్ ద్వారా కార్తీ వనభోజన కార్యక్రమం ఏర్పాటైంది. సదానందంగుప్తా మాట్లాడుతూ..కార్తీకమాసంలో వనభోజనాల వల్ల సంఘం సంఘటితమవుతుందని పేర్కొన్నారు.

నేడే ఓటరు తీర్పు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 28.19 లక్షల మంది ఓటర్లు

- 5 అసెంబ్లీ స్థానాల్లో 126 మంది పోటీ
- త్రిముఖ పోటీల్లో ఓటరు మొగ్గు ఎటువైపో..
- 2,439 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు
- అన్నీ పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు
- ఎన్నికల విధుల్లో 12,510 మంది సిబ్బంది
- బందోబస్తులో 3 వేల మంది పోలీసులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ ఎన్నికల్లో 28,19,067 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లా ఎన్నికల సంఘం పక్కా ఏర్పాట్లు చేసింది. వీరి కోసం జిల్లాలో 841 లొకేషన్లలో 2,439 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, వీటిలో అర్బన్ పోలింగ్ కేంద్రాలు 2,280, రూరల్ పోలింగ్ కేంద్రాలు 159 ఉన్నాయి. అలాగే, జిల్లాలో 135 లొకేషన్ల పరిధిలో 435 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించిన అధికార యంత్రాంగం అదనపు పోలీసు బలగాలతో భారీ బందోబస్తుకు కసరత్తు చేసింది. జిల్లాలోని 2,439 పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటులో భాగంగా సీసీ కెమెరాలు అమర్చారు. పోలింగ్ స్టేషన్ ప్రాంగణంలో క్యూలైన్లు కవర్ అయ్యేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు ఎప్పటికప్పుడు మానిటరింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటోంది. పోలింగ్ నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా 3 వేల మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. ఓటర్లు ఓటును వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల్లో 6,422 బ్యాలెట్ యూనిట్లు, 3050 కంట్రోల్ యూనిట్లు, 3373 వీవీ ప్యాట్లు ఏర్పాటు చేశారు.

పోలింగ్ నిర్వహణకు 12,510 సిబ్బంది

జిల్లాలో 2,439 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 12,510 మంది సిబ్బందిని నియమించారు. ఇందులో 2,880 మంది పీవోలు, 2,860 మంది ఏపీవోలు, 6,570 మంది ఓపీవోలు ఉన్నారు. రూట్ ఆఫీసర్లు, సెక్టర్ అధికారులను కూడా నియమించారు. పోలింగ్ కేంద్రాల పరిశీలనలో భాగంగా 200 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు.

మహిళా సిబ్బందితో 25 ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు

జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదు మహిళా పోలింగ్ కేంద్రాల చొప్పున ఐదు నియోజకవర్గాల్లో 25 మహిళా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో పూర్తిగా మహిళా అధికారులు, సిబ్బందే ఎన్నికల విధులు నిర్వర్తిస్తారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో దివ్యాంగులకు ఒకటి చొప్పున ఐదు నియోజకవర్గాలకు ఐదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఇందులో కూడా దివ్యాంగులే ఎన్నికల విధులను నిర్వర్తిస్తారు. యువత కోసం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్కో పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. జిల్లాలో మోడల్ పోలింగ్ కేంద్రాలను ప్రతీ నియోజక వర్గంలో ఐదు చొప్పున 25 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బ్రెయిలీ లిపిలో ఉన్న నమూనా బ్యాలెట్‌తో అంధులకు ఓటు వినియోగించుకునేలా ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌ఛైర్స్ ఏర్పాటు చేశారు.

ఏదో ఒక గుర్తింపు కార్డు తప్పని సరి

ఓటు వినియోగించుకునేందుకు ఫొటోతో ఉన్న ఓటరు కార్డు లేదా ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక కార్డును పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఓటర్ ఎపిక్ కార్డు, ఆధార్ కార్డు, ఉపాధి హామీ పథకం కార్డ్, బ్యాంక్ /పోస్టాఫీస్ (ఫొటోతో ఉన్నవి). పాస్‌బుక్, ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, జాతీయ జనాభా రిజిస్టరు జారీ చేసిన స్మార్ట్ కార్డ్, పాస్‌పోర్ట్, ఫొటోతో ఉన్న పింఛన్ పత్రం, ఉద్యోగులకు కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వం/ప్రభుత్వ సంస్థలు /పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డు, చట్టసభలలో సభ్యత్వాన్ని చూపే అధికారిక గుర్తింపు కార్డుల్లో ఏదో ఒక గుర్తింపు కార్డుతో పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటును వినియోగించుకోవాల్సి ఉంటుంది.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు ..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
మేడ్చల్	3,28,222	3,09,568	48	6,37,838
మల్కాజిగిరి	2,46,731	2,42,242	11	4,88,984
కుత్బుల్లాపూర్	3,66,660	3,32,223	159	6,99,042
కూకట్‌పల్లి	2,42,800	2,20,884	123	4,63,807
ఉప్పల్	2,75,216	2,54,140	40	5,29,396
మొత్తం	14,59,629	13,59,057	381	28,19,067

బ్యాలెట్‌తో 7,628 మంది ఎన్నికల సిబ్బంది

జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో 7,628 మంది బ్యాలెట్ ద్వారా వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 3,154 మంది సిబ్బంది మాత్రమే పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నట్లు జిల్లా ఎన్నికల సంఘం పేర్కొంది. జిల్లాలో హోం ఓటింగ్ కోసం 1070 మంది దరఖాస్తు చేసుకోగా, ఇప్పటి వరకు 1,007 మంది ఓటును వినియోగించుకున్నారు. ఇందులో 80 ఏళ్ల పైబడిన వారు 668 మంది ఉండగా, దివ్యాంగులు 339 మంది ఉన్నారు.

5 స్థానాల్లో 126 మంది అభ్యర్థులు పోటీ

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో ఐదు శాసనసభ నియోజకవర్గాల్లో 126 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముఖాముఖి పోటీ నెలకొని ఉండగా, మరి కొన్నింటిలో త్రిముఖ పోటీ కొనసాగుతోంది.

ఓటింగ్ శాతం పెంచడమే లక్ష్యం

- కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు
- నియోజకవర్గంలో 80వేలకు పైనే కొత్త ఓటర్లు
- 100 శాతం పోలింగ్ నమోదుకు ముందుకు రావాలని విజ్ఞప్తి
- నిర్లక్ష్యం వదిలి ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని అభ్యర్థన



కుత్బుల్లాపూర్: ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కుత్బుల్లాపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు పలు కార్యక్రమాలు చేపట్టి సంక్షేమ సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తూ వచ్చారు. బుధవారం 30వ తేదీన జరిగే పోలింగ్‌లో యువత పెద్ద ఎత్తున పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 6.99 లక్షల మంది ఓటర్లు నమోదు కాగా అధిక శాతం జిల్లాలో ఓటింగ్ నమోదు అయ్యేలా ఏర్పాటు చేశారు. చైతన్యవంతులైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని వంద శాతం పోలింగ్ నమోదు అయ్యేలా నడుం బిగించి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

గుర్తింపు కార్డులపై అయోమయం..!

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న ఇప్పటి వరకు కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి గుర్తింపు కార్డులు అందలేదు. దీంతో కార్డు కోసం ఎదురుచూస్తున్న వారికి నిరాశే ఎదురవుతోంది.

2లక్షలకు పైగా గుర్తింపు కార్డులు అందని వైనం

మొత్తం 6,99,130 మంది ఓటర్లు ఉండగా వారిలో సుమారు 2లక్షలకు పైగా గుర్తింపు కార్డులు అందకపోవడంతో ప్రజలు మీసేవ, ఈసేవ సెంటర్లను ఆశ్రయించి తమ ఓటు ఎక్కడ ఉంది అనే విషయంపై ఆరా తీస్తున్నారు. జనవరి 6వ తేదీ నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు ఎన్నికల అధికారులు ప్రకటించిన విధంగా కొత్త ఓటర్లు 80వేల పైగానే ఉన్నారు.

ఓటర్ లిస్టులో పేరు ఉంటే..
ఏదైనా గుర్తింపు కార్డు ఉంటే చాలు..

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వీరందరికీ దశలవారీగా ఓటర్ గుర్తింపు కార్డులను అందజేసే బాధ్యత పోస్ట్ ఆఫీస్‌కు అప్పగించారు. చిరునామాల విషయంలో కొలిక్కి రాకపోవడంతో ఈ కార్డులను బీఎల్‌ఓలకు అప్పగించారు. వారు వాటిని పంపిణీ చేయకుండా కాలయాపన చేయడంతో ఈ సమస్య ఎదురైంది. అయితే అధికారులు మాత్రం పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న లిస్టులో పేర్లు చూసుకొని గుర్తింపు కార్డుతో ఓటు వేసుకోవాలని సూచిస్తున్నారు.

పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు

సాక్షి, మేడ్చల్‌జిల్లా: మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలోని ఐదు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల(డీఆర్‌సీ) నుంచి ఈవీఎంలను 2,349 పోలింగ్ కేంద్రాలకు బుధవారం రాత్రి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా పంపిణీ చేశారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు భోగారంలోని హోలీమేరీ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి ఈవీఎంలను తరలించారు. అలాగే, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను సైనిక్‌పురి భవన్స్ కాలేజీ నుంచి, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలను జెఎన్‌టీయూ నుంచి, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలను రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల నుంచి తరలించారు. అలాగే, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు అల్వాల్ లయోలా కాలేజ్ నుంచి ఈవీఎంలను పంపిణీ చేశారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పోలీసు స్టేషన్ పరిధిలో మూడు అసెంబ్లీ నియోజక వర్గాలు ఉన్నాయని సీఐ పి.ఆంజనేయులు పేర్కొన్నారు. నేడు జరిగే అసెంబ్లీ ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లపై ఆయన మాట్లాడారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని తార్నాక, లాలాపేట, రవీంద్రనగర్, నాగార్జుననగర్ ఉప్పల్ నియోజకవర్గంలోని హబ్సిగూడ, పీ అండ్ టీ కాలనీ, రవీంద్రనగర్, ఓయూ క్యాంపస్‌లోని బస్తీలు, అంబర్‌పేట్ అసెంబ్లీ నియోజకవర్గాలలోని అడిక్‌మెట్ వైపు గల ఓయూ క్యాంపులలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఓయూలో పోలీస్ స్టేషన్ పరిధిలోని 53 పోలిగ్ కేంద్రాలలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ఓయూ పోలీసులు, ఐదుగురు ఎస్‌ఐలతో పాటు అదనంగా 130 మంది సిబ్బంది మోహరించిన్నట్లు చెప్పారు. తార్నాక డివిజన్‌లోని నాగార్జునగర్, మాణికేశ్వనర్‌ను సమస్యాత్మక ప్రాంతాలుగా గురించి పోలీసు బలగాలను భారి సంఖ్యలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది ఏర్పడిన వెంటనే 8712660562 నంబర్‌కు ఫోన్ చేయాలని సీఐ ఆంజనేయులు పేర్కొన్నారు.

దుబాయ్ సదస్సులో ప్రొ.హమీదాబి ఉపన్యాసం



ఉస్మానియా యూనివర్సిటీ: దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ స దస్సుకు ఓయూ మైక్రో బయోలజీ అధ్యాపకురాలు ప్రొ. డాక్టర్ హమీ దాబి హాజరై ఉపన్యసించారు. ఈ నెల 26 నుంచి 29 వరకు దుబాయ్‌లోని బిట్స్‌పిలాని క్యాంపస్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో మల్టీ ఫంక్షనల్ మైక్రోబియల్ సర్ఫ్యాక్టెంట్స్ ఫర్ సస్టైనబుల్ ఆగ్రో ఫుడ్ ఇండస్ట్రీ అనే అంశం పై ఉపన్యసించారు. భారత్, అమెరికాతో పాటు ఆరు దేశాలు పాల్గొన్న అంతర్జాతీయ సదస్సుకు 300 మంది ప్రతినిధులు పాల్గొన్నట్లు ఓయూ అధికారులు వివరించారు. ఓయూ నుంచి దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సుకు హాజరై పరిశోధన పత్రాన్ని సమర్పించడం పట్ల ఓయూ వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ డాక్టర్ హమీదాబిని అభినందిచారు.

ఎన్నికల సామగ్రి అందజేత

ఉస్మానియా యూనివర్సిటీ: నేడు జరిగే ఎన్నికల కోసం ఓయూ క్యాంపస్‌లోని ఎంబీఏ కాలేజీలో సనత్‌నగర్ నియోజకవర్గం, దూరవిద్య కేంద్రంలో సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఈవీఎంల పై అవగాహన కల్పించి ఎన్నికల సామగ్రిని అందజేశారు. జిల్లా ఉప ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఓయూను సందర్శించి సిబ్బంది, అధికారులకు కావాల్సిన వసతులపై సమీక్షించారు.

డీఆర్‌సీని సందర్శించిన కలెక్టర్

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఎస్పీరోడ్డులోని సీఎస్‌ఐ వెస్లీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కొనసాగుతున్న కంటోన్మెంట్ నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్, రిసిప్షన్, కౌంటింగ్ (డీఆర్సీ) కేంద్రాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈవీఎంలను పోలింగ్ స్టేషన్లకు తరలింపు, ఎన్నికలు పూర్తయ్యాక వచ్చిన ఈవీఎంలను భద్రపరచడం తదితర అంశాల గురించి చర్చించారు. అలాగే ఎన్నికల జనరల్ అబ్జర్వర్ గాయిత్రి కృష్ణన్ కూడా డీఆర్సీ కేంద్రాన్ని పరిశీలించారు.

'జోరుగా పోల్ మేనేజ్‌మెంట్' !

అత్తాపూర్: ప్రచార గడువు ముగిసిపోవడంతో రాజేంద్రనగర్ అభ్యర్థులు పోటాపోటీగా ఓటర్లను ఆకట్టుకునే పనిలో మునిగిపోయారు. మద్యం, డబ్బు పంపిణీ జోరుగా కొనసాగుతోంది. ఒక్కో ఓటు రెండు వేలతో ఆకట్టుకునే యత్నాలు చేస్తున్నట్లు సమాచారం. చాలా చోట్ల మద్యం సీసాలు మంగళవారం సాయంత్రమే పంపిణీ అయినట్లు తెలుస్తోంది. వనరులు పుష్కలంగా ఉన్న అధికార పార్టీ రెండుసార్లు మద్యం పంపిణీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అధికార పార్టీతో పాటు ఇతర పార్టీలు కూడా పంపిణీ చేసినట్లు పలువురు చెబుతున్నారు. ప్రస్తుతం జెండాలు, బ్యానర్‌లు లేకుండా నిశబ్ద వాతావారణం నెలకొంది. కాలనీల్లో పెద్దలతో ఓటు వేయించడం కోసం నోట్లు వేయించుకున్నట్లుగా సమాచారం. నిఘా యంత్రాంగం ఎంత కట్టడి చేసినా మద్యం పంపిణీనీ మాత్రం అడ్డుకోలేకపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.